క్లుప్తంగా

ఆకట్టుకున్న సైన్స్ ఫెయిర్



ప్రదర్శనలు తిలకిస్తున్న ఎంఈఓ మనోహరం

రాజోలు: మాంటిస్సోరి పాఠశాలలో ఏర్పాటు చేసిన సైన్స్ విజ్ఞాన ప్రదర్శన ఎంతగానో ఆకట్టుకుంది. శనివారం పాఠశాలలో ఏర్పాటు చేసిన ప్రదర్శనను ఎంఈఓ నల్లి మనోహరం ప్రారంభించారు. ఒకటో తరగతి నుంచి ఆరో తరగతి వరకు చదువుతున్న చిన్నారులు సుమారు 100 ప్రదర్శనలు తయారు చేశారు. ఎంఈఓ-2 ప్రసాదరావు, రిటైర్డ్ ఎంఈఓ జొన్నలగడ్డ గోపాలకృష్ణ, పాఠశాల కరస్పాండెంట్ ప్రసాద్, ప్రిన్సిపాల్ రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా వీరభద్రస్వామి సంబరం

మామిడికుదురు: బి.దొడ్డవరం గ్రామంలోని బొలిశెట్టివారిపాలెంలో వీరభద్రస్వామి సంబరం ఆదివారం వైభవంగా జరిగింది. మేళతాళాలు, సన్నాయి వాయిద్యాలు, భక్తుల కోలాహలం, బాణసంచా కాల్పులు, నృత్యాల నడుమ వైనతేయ గోదావరి నది వరకు స్వామిని ఊరేగింపుగా తీసుకువెళ్లారు. అక్కడ నదిలో పుణ్యస్నానాలు ఆచరించిన అనంతరం నది వద్ద వేగి శ్రీను, ఉలిశెట్టి రాంబాబు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వీరభద్రస్వామి సంబరాన్ని బొలిశెట్టివారిపాలెంలో ఘనంగా జరిపించారు. విఘ్నేశ్వర పూజ, శమీవృక్షం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ పూజలు ఆద్యంతం కనుల పండువలా నిర్వహించారు. పలువురు భక్తులు ఈ పూజల్లో పాల్గొని స్వామిని దర్శించుకున్నారు. భక్తులకు భారీ అన్న సమారాధన ఏర్పాటు చేశారు.

ఆర్యవైశ్య సంఘ అధ్యక్షుడిగా శ్రీను



అంబాజీపేటలో నూతనంగా ఎన్నికైన ఆర్యవైశ్య సంఘ సభ్యులు

అంబాజీపేట: మండల ఆర్యవైశ్య సంఘ అధ్యక్షుడిగా కాసు శ్రీనును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. స్థానిక శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయం వద్ద ఆర్యవైశ్య సంఘ సభ్యుల సమావేశం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా ఆర్యవైశ్య సంఘ నూతన కమిటీని ఎన్నుకున్నారు. కార్యదర్శిగా గోకవరపు శివ, ట్రెజరర్‌గా బొండాడ శివలను ఎన్నుకున్నారు. ఈ నూతన కార్యవర్గం రెండేళ్లపాటు పదవిలో ఉంటారన్నారు. నూతనంగా ఎన్నికైన సంఘ సభ్యులు మాట్లాడుతూ పెద్దలు, యూత్ సహాయ సహకారాలతో సంఘ బలోపేతానికి, అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామన్నారు. ఈ సమావేశంలో ఆర్యవైశ్య సంఘ నాయకులు పాల్గొన్నారు.

అయినవిల్లిలో రామదేవుని పూజలు

అయినవిల్లి: స్థానిక సీతారామాలయంలో రామదేవుని పూజలు ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ అర్చకుడు పెద్దింటి లక్ష్మణాచార్యుల ఆధ్వర్యంలో ఈ పూజలు జరిపారు. మహిళా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి ప్రసాదాన్ని స్వీకరించారు.

సేవలే చిరస్థాయిగా నిలిచిపోతాయి



అంబాజీపేటలో సూర్యప్రకాశరావును సన్మానిస్తున్న ఎస్టీయు నాయకులు, ఉపాధ్యాయులు

అంబాజీపేట: ప్రాథమిక దశలో ఎలిమెంటరీ విద్యార్థులకు క్రమశిక్షణతో కూడిన విద్యాబోధన చేసి ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దిన ప్రకాశరావు విద్యార్థుల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోతాయని జిల్లా ఎస్టీయూ అధ్యక్షుడు పీఎస్ రామారావు అన్నారు. నందంపూడిలో ప్రజా పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడిగా సుదీర్ఘ కాలం విధులు నిర్వహించిన నల్లి సూర్యప్రకాశరావు ఉద్యోగ విరమణ సభ ఆదివారం అంబాజీపేట వాసవి కన్యకా పరమేశ్వరి ఫంక్షన్ హాల్‌లో జరిగింది. ఈ సందర్భంగా స్థానిక మండల ఎస్టీయూ శాఖ సూర్యప్రకాశరావు దంపతులను ఘనంగా సన్మానించారు.

కనులపండువగా హనుమద్ వాహన సేవ



చింతలూరులో హనుమద్ వాహనంలో ఊరేగుతున్న వేంకటేశ్వరస్వామి

ఆలమూరు: చింతలూరు శ్రీ, భూ సమేత వేంకటేశ్వర స్వామి వారి పాంచాహ్నిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా నాలుగో రోజు హనుమద్ వాహనం ఎక్కి శ్రీరాముని అవతారంలో భక్తులకు అభయ ప్రదానం చేశారు. శ్రీ, భూ సమేత వేంకటేశ్వరస్వామి హనుమద్ వాహనంలో విహరిస్తుంటే అశేష జన సమూహం ముందుకు కదులుతూ ఆనంద తన్మయత్వంతో గోవింద నామస్మరణ చేస్తూ పులకించి తరించారు. వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య ఆలయ ఆవరణలో ఆరోగ్య సిద్ధి, మాఘమాస వ్రతం నిర్వహించారు. బ్రహ్మోత్సవాలను తిలకించే భక్తులకు భారీ అన్న సమారాధన జరిగింది.



చొప్పెల్లలో పల్స్ పోలియో వివరాలను తెలుసుకుంటున్న డీఎంఅండ్‌హెచ్‌వో సుమలత



కొత్తపేటలో చిన్నారులకు పోలియో చుక్కలు వేస్తున్న డేవిడ్‌రాజు, గంగాధరరావు



అయినవిల్లిలో జెడ్పీటీసీ గన్నవరపు శ్రీనివాసరావు



విశ్వేశ్వరాయపురంలో జెడ్పీటీసీ బల్ల ప్రసన్నకుమారి



సఖినేటిపల్లి పీహెచ్‌సీలో ఎంపీపీ వీరా మల్లిబాబు

పోలియో చుక్కలతో అంగవైకల్యం దూరం

- పల్స్ పోలియో విజయవంతం
- చిన్నారులకు పోలియో చుక్కలు వేసిన ప్రజాప్రతినిధులు

ఆలమూరు: మండలంలో ఆదివారం నిర్వహించిన పల్స్ పోలియో 98.1 శాతం పూర్తయింది. ఆయా పంచాయతీ కార్యాలయాలు, ఆరోగ్య ఉపకేంద్రాలు, బస్టాండు సెంటర్ల వద్ద నిర్వహించిన ఈ పల్స్ పోలియో శిబిరాలను ఆయా గ్రామాల సర్పంచ్‌లు ప్రారంభించారు. కొత్తపేట డివిజనల్ వైద్యారోగ్యశాఖ అధికారి ఎం.సుమలత పోలింగ్ కేంద్రాలను పరిశీలించగా పెదపళ్ల, చొప్పెల్ల పీహెచ్‌సీ అధికారులు పి.భవానీశంకర్, డి.సువర్చలా నాయుడు, ఆర్.మల్లికార్జున్, డి.సాయికిశోర్ ఏర్పాట్లను పర్యవేక్షించారు. మండలంలో ఏర్పాటు చేసిన నాలుగు రూట్లలో ఆరుగురు అధికారులు పర్యవేక్షణలో 37 కేంద్రాల ద్వారా 148 మంది సిబ్బంది తమ సేవలను అందజేశామన్నారు.

రాజోలులో 97 శాతం

రాజోలు: మండలంలో 97 శాతం మంది చిన్నారులకు ఆదివారం పోలియో చుక్కలు వేశారు. తాటిపాక పీహెచ్‌సీ వద్ద ఎంపీపీ కేతా శ్రీనివాస్ చిన్నారులకు పోలియో చుక్కలు వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. మండలంలో 4520 మంది చిన్నారులు లక్ష్యం కాగా 97 శాతం పూర్తి చేశారు. పీహెచ్‌సీ వైద్యుడు సిహెచ్ ఫణికిరణ్, జి.మానససుప్రియ ఆధ్వర్యంలో 150 మంది సిబ్బందితో 28 పోలియో శిబిరాలు, ప్రయాణంలో ఉన్న చిన్నారుల కోసం రాజోలు ఆర్టీసీ బస్టాండ్‌లో ఒక శిబిరంతో పాటు మొబైల్ క్యాంప్ ద్వారా పోలియో చుక్కలు వేశారు.

కొత్తపేటలో..

కొత్తపేట: పోలియో రహిత సమాజం అందరి లక్ష్యమని అముడాచైర్మన్ గొల్లపల్లి డేవిడ్‌రాజు, ఎంపీపీ మార్గన గంగాధరరావు అన్నారు. ఆదివారం పల్స్ పోలియో సందర్భంగా స్థానిక కమ్మిరెడ్డిపాలెం ఎంపీపీ పాఠశాల బూత్ వద్ద వారిరువురు పలువురు చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. వారు మాట్లాడుతూ ఏ ఒక్కరూ పోలియో బారిన పడకూడదని, పోలియో రహిత సమాజం లక్ష్యంగా నిర్వహిస్తున్న పల్స్ పోలియో కార్యక్రమాన్ని 5 ఏళ్ల లోపు చిన్నారులకు సద్వినియోగపర్చుకోవాలని పిలుపునిచ్చారు.



పి.గన్నవరం సీహెచ్‌సీలో పిల్లలకు పోలియో చుక్కలు వేస్తున్న జెడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు



నగరం పీహెచ్‌సీలో పి.గన్నవరం ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు

అయినవిల్లిలో 98.2 శాతం

అయినవిల్లి: పోలియో చుక్కలు పిల్లలు పోలియో మహమ్మారి బారిన పడకుండా నిండు నూరేళ్లు ఆరోగ్యంగా ఉండేలా చేస్తాయని స్థానిక జెడ్పీటీసీ సభ్యుడు గన్నవరపు శ్రీనివాసరావు అన్నారు. అయినవిల్లి పీహెచ్‌సీ పరిధిలో మొత్తం 2907 మంది పిల్లలకు 2854 మందికి పోలియో చుక్కలు వేశారన్నారు. 98.2 శాతం పోలియో చుక్కలు వేయడం పూర్తి చేశామన్నారు. వీరవల్లిపాలెం పీహెచ్‌సీ పరిధిలో 2385 మందికి గాను 2314 మందికి పిల్లలకు పోలియో చుక్కలు వేశారన్నారు. 97 శాతం మందికి పోలియో చుక్కలు వేశామన్నారు.

పోలియో రహిత సమాజం కోసం కృషి చేయాలి

సఖినేటిపల్లి: పోలియో రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు అన్నారు. ఆదివారం మోరి పీహెచ్‌సీలో ఏర్పాటు చేసిన పోలియో చుక్కల కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. అప్పుడే పుట్టిన బిడ్డ నుంచి 5 సంవత్సరాల్లోపు పిల్లలు అందరికీ పోలియో చుక్కలు వేయించాలని ఆయన తల్లిదండ్రులకు సూచించారు.

మలికిపురంలో..

మలికిపురం: పోలియో కార్యక్రమాన్ని చిన్నారుల తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని జెడ్పీటీసీ బల్ల ప్రసన్నకుమారి అన్నారు. మలికిపురం మండలం విశ్వేశ్వరాయపురం గ్రామ సచివాలయంలో ప్రసన్నకుమారి చిన్నారులకు ఆదివారం పోలియో చుక్కలు వేశారు.

రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో

పోలియో నిర్మూలనకు రోటరీ ఇంటర్నేషనల్ సంస్థ విరాళం ఇచ్చి ప్రపంచంలో పోలియో నిర్మూలనకు తన వంతు కృషి చేస్తుందని రోటరీ అసిస్టెంట్ గవర్నర్ నల్లి శివకుమార్ తెలియజేశారు. మలికిపురం పంచాయతీ వద్ద రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో పల్స్ పోలియో చుక్కల కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రోటరీ అధ్యక్షుడు సోమిశెట్టి మురళీకృష్ణ, ఎస్సై సంపత్‌కుమార్, అంగన్వాడీ సిబ్బంది పాల్గొన్నారు

మహమ్మారిని తరిమి కొడదాం

మామిడికుదురు: పోలియో మహమ్మారిని తరిమి కొట్టేందుకు ప్రజలు సహకారం అందించాలని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు కోరారు. నగరం పీహెచ్‌సీలో పల్స్ పోలియో కార్యక్రమాన్ని ఆదివారం ఎమ్మెల్యే ప్రారంభించారు. మూడు రోజుల పాటు జరిగే ఈ కార్యక్రమంలో అయిదేళ్ల లోపు చిన్నారులకు విధిగా పోలియో చుక్కలు వేయించాలన్నారు. లూటుకుర్రు పీహెచ్‌సీలో మండల సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు అడబాల తాతకాపు పల్స్ పోలియోను ప్రారంభించారు. ఆయా కార్యక్రమాల్లో పీహెచ్‌సీ వైద్యాధికారులు కేజే ప్రశాంత్, కె.స్వర్ణలత, స్పందన పాల్గొన్నారు.



అంబాజీపేట పీహెచ్‌సీలో ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు



తాటిపాకలో పీహెచ్‌సీలో ఎంపీపీ కేతా శ్రీనివాస్



గోపాలపురం పీహెచ్‌సీలో ఎంపీపీ లక్ష్మీవెంకట నాగదేవి

అంబాజీపేటలో..

అంబాజీపేట: భారతదేశం నుంచి పోలియోను తరిమి కొట్టడానికి 25 ఏళ్ల సుదీర్ఘ సమయం పట్టిందని ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, జెడ్పీటీసీ బూడిద వరలక్ష్మి అన్నారు. ఇందులో వైద్య సిబ్బంది కృషి ఎంతో ఉందన్నారు. పల్స్‌పోలియో కార్యక్రమంలో భాగంగా అంబాజీపేట, ముక్కామల పీహెచ్‌సీల వద్ద వైద్యాధికారులు వి.గౌతమి, కె.ఎస్.శ్రీనివాస్‌ల పర్యవేక్షణలో ఆదివారం చిన్నారులకు వీరు పోలియో చుక్కలు వేసి ప్రారంభించారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్లు, ఏఎన్‌ఎంలు, ఆశాలు, అంగన్‌వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పి.గన్నవరంలో..

పి.గన్నవరం: పోలియో మహమ్మారిని తరిమి కొట్టేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పి.గన్నవరం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి, జెడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు అన్నారు. స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రంలో పల్స్ పోలియో కార్యక్రమాన్ని ఆదివారం ఆయన ప్రారంభించారు. చిన్నారులకు ఆయన పోలియో చుక్కలు వేశారు. ఐదేళ్లలోపు పిల్లలందరికీ పోలియో చుక్కలు వేయించాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు అడ్డగళ్ల వెంకట సాయిరామ్, పితాని నర్సింహారావు తదితరులు పాల్గొన్నారు. కె.ఏనుగుపల్లి గ్రామ సచివాలయంలో సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు తోలేటి బంగారు నాయుడు, బెల్లంపూడిలో సర్పంచ్ బండి మహాలక్ష్మి పిల్లలకు పోలియో చుక్కలు వేశారు.

రావులపాలెం: పోలియో రహిత సమాజానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎంపీపీ కర్రి లక్ష్మీవెంకట నాగదేవి అన్నారు. ఆదివారం రావులపాలెం మండలం ఊబలంక, గోపాలపురం పీహెచ్‌సీల పరిధిలో పల్స్ పోలియో కార్యక్రమాన్ని నిర్వహించారు. గోపాలపురం పీహెచ్‌సీలో జరిగిన కార్యక్రమాన్ని ఎంపీపీ నాగదేవి ప్రారంభించారు. మండలంలో 97.16 శాతం పల్స్ పోలియో జరిగినట్టు అధికారులు తెలిపారు. అలాగే ఈ కేంద్రాలను ఎంపీడీఓ ఎ.శ్రీనివాస్ పరిశీలించారు.

జగన్‌ను సింగిల్‌గా ఎదుర్కొనే దమ్ము లేదు

మామిడికుదురు: ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించే దిశగా సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రాధాన్యం ఇస్తున్నారని రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు పేర్కొన్నారు. గెద్దాడలో రూ.36.90 లక్షలతో చేపట్టనున్న తాగునీటి పైప్‌లైన్ పనులకు ఆదివారం ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలన్నింటినీ అమలు చేశామన్నారు. అందుకే ప్రజల వద్దకు ధైర్యంగా వెళ్తున్నామని చెప్పారు. జగన్ పాలన చూసి ప్రతిపక్షాలకు వెన్నులో వణుకు పుడుతుందన్నారు. సింగిల్‌గా జగన్‌ను ఎదుర్కొనే దమ్ము లేక పొత్తులతో ముందుకు వస్తున్నారన్నారు. పొత్తులతో వచ్చినా సింగిల్‌గా వచ్చినా ఎన్నికల రణరంగంలో వైఎస్సార్ సీపీదే తుది విజయమని రాపాక ధీమా వ్యక్తం చేశారు. అభివృద్ధి, సంక్షేమంతో కూడిన వలంటీర్ల పాలన కావాలో, జన్మభూమి కమిటీల పాలన కావాలో ప్రజలు తేల్చుకోవాల్సిన సమయం ఆసన్నమైందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ కుసుమ వనజకుమారి, ఏఎంసీ చైర్మన్ గుబ్బల రోజామణి, సర్పంచ్ గుబ్బల గీతాభవాని, ఎంపీటీసీ జవ్వాది పద్మావతి, పార్టీ మండల శాఖ అధ్యక్షుడు బొలిశెట్టి భగవాన్, పార్టీ నేతలు సూరిశెట్టి బాబి, కంచర్ల శేఖర్, గూటం వెంకటేష్, జిల్లెళ్ల శ్రీను, బొక్కా శ్రీరామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.



గెద్దాడలో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వరప్రసాదరావు

ప్రజా సమస్యల పరిష్కారం

మలికిపురం: గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం(జీజీఎంపీ) ద్వారా నియోజకవర్గంలో తన దృష్టికి వచ్చిన సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తున్నట్లు రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు అన్నారు. మలికిపురం మండలం అడవిపాలెంలో రూ.10 లక్షల జీజీఎంపీ నిధులతో నిర్మించిన నూతన సీసీ రహదారిని ఎమ్మెల్యే రాపాక ఆదివారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ప్రజా సంక్షేమమే ప్రధాన అజెండాగా పని చేసిన ఏకైక ప్రభుత్వం ఇదేనని అన్నారు. నియోజక వర్గంలో రోడ్ల సమస్యలతో పాటు తాగునీటి సమస్యలను సైతం పరిష్కరించామని అన్నారు. వచ్చే ఎన్నికలలో జగన్‌ను మరోసారి ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ కొల్లు అనంతలక్ష్మి, నాయకులు కొల్లు నరసింహస్వామి, నల్లి సత్యనారాయణ, మనస్సే పాల్గొన్నారు.

బాలయోగి చిరస్మరణీయుడు

రాజోలు/మామిడికుదురు/అయినవిల్లి/అంబాజీపేట: లోక్‌సభ మాజీ స్పీకర్ జీఎంసీ బాలయోగి చిరస్మరణీయుడని రాజోలు ఎంపీపీ కేతా శ్రీనివాస్ అన్నారు. ఆదివారం బాలయోగి 22వ వర్ధంతి పురస్కరించుకుని రాజోలు కాటన్ పార్కులోని బాలయోగి విగ్రహానికి టీడీపీ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. మామిడికుదురు మండలం టీడీపీ మండల శాఖ అధ్యక్షుడు మొల్లేటి శ్రీనివాస్ ఆధ్వర్యంలో పాశర్లపూడి కొండాలమ్మచింత సెంటర్లో ఉన్న బాలయోగి విగ్రహానికి టీడీపీ నేతలు ఆదివారం పూలమాలలు వేసి నివాళులర్పించారు. జీఎంసీ బాలయోగి చిరస్మరణీయుడని ఆ చారిటబుల్ సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షుడు గంగుమళ్ల శ్రీనివాస్ పేర్కొన్నారు. కె.జగన్నాథపురంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో బాలయోగి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అంబాజీపేటలో టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి గూడాల ఫణి ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం బాలయోగి వర్ధంతి నిర్వహించారు. వక్కలంక బుల్లియ్య సమకూర్చిన దుస్తులు, టవల్స్‌ను నిరుపేదలకు అందజేశారు.

జగన్‌ను మళ్లీ ముఖ్యమంత్రిని చేయాలి



ముంగండలో ముత్యాలమ్మకి పూజలు చేస్తున్న జెడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు

పి.గన్నవరం: వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీకి ఓట్లేసి జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిని చేయాలని నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జి, జెడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు అన్నారు. ముంగండలో పార్టీ శ్రేణులతో ఆదివారం ఆయన ఆత్మీయ సమావేశం నిర్వహించి, ప్రసంగించారు. అనంతరం ప్రజలను కలుసుకుని ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. జగన్‌ను ఆశీర్వదించాలని కోరారు. గ్రామంలోని ముత్యాలమ్మ వారిని దర్శించుకుని పూజలు చేశారు. చర్చిలో ప్రార్థనలు చేశారు. నాయకులు కుసుమ వెంకటేశ్వరరావు, సరెళ్ల అప్పారావు, బొడ్డు సురేష్, దేశిరాజు సీతారామయ్య, జంగా చంద్రమౌళి, ముక్కామల కిష్టప్ప, కొప్పిశెట్టి వెంకన్న, అడ్డగళ్ల వెంకట సాయిరామ్ తదితరులు పాల్గొన్నారు.

సమతుల్యతా అంశాలతో విద్యను అందించాలి



అవార్డులు పొందిన విద్యార్థులతో సెయింట్ పాట్రిక్స్ ఉపాధ్యాయులు సిబ్బంది

రావులపాలెం: నేటి పోటీ ప్రపంచంలో విద్యార్థులు విద్యతో పాటు ఇతర అంశాలపై పట్టు ఉండేలా అన్ని సమతుల్యతా అంశాలను జోడించి విద్యను అందించేలా తల్లిదండ్రులు ఆలోచన చేయాలని రెండో అదనపు జిల్లా సెషన్స్ జడ్జి వెలమల నరేష్ అన్నారు. ఆదివారం స్థానిక సెయింట్ పాట్రిక్స్ అకాడమీ వార్షికోత్సవం సందర్భంగా ప్రిన్సిపాల్ బ్రదర్ సోలమన్‌రాజారాజన్ పర్యవేక్షణలో కళా సంగమం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.

ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సెషన్స్ జడ్జి నరేష్ హాజరై విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. విద్యార్థుల విద్య కోసం సరైన పాఠశాలను ఎంచుకున్నందుకు తల్లిదండ్రులను ఆయన అభినందించారు. పాఠశాల సమతుల్య పాఠ్యాంశాలను జోడించి పోటీ ప్రపంచంలో విద్యార్థులను తయారు చేయడంపై దృష్టి సారించడం అభినందనీయమన్నారు. వార్షికోత్సవం సందర్భంగా నిర్వహించిన కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. విద్యార్థుల పాఠ్యేతర కార్యక్రమాల్లో పాల్గొని పాఠశాలకు కీర్తిని తెచ్చిన విద్యార్థులను, 100% హాజరు, స్వీయ మూల్యాంకనం, జాతీయ ఒలింపియాడ్ పరీక్షలకు ఎంపికైన వారిని, వివిధ కార్యక్రమాలలో ప్రతిభ చూపిన విద్యార్థులకు అవార్డులు ఇచ్చి అభినందించారు. ఈ కార్యక్రమాలను వైస్ ప్రిన్సిపాల్ ఫెలిక్స్ అరుణ్, స్పోర్ట్స్ సెక్రటరీ ఫెలిక్స్ కుమార్ పర్యవేక్షించారు. కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

రాజకీయంగా బలహీన వర్గాలకు అగ్రస్థానం

రాజోలు: బడుగు, బలహీన వర్గాలకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి రాజకీయంగా అగ్రస్థానాలు కల్పించారని ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు అన్నారు. ఆదివారం ఆయన తాటిపాకలో మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావును మర్యాదపూర్వకంగా కలిశారు. ఇటీవల గొల్లపల్లి సూర్యారావు టీడీపీని వీడి వైఎస్సార్ సీపీలో చేరడంపై సూర్యనారాయణరావు కలసి అభినందనలు తెలిపారు. రాజ్యాంగ బద్ధమైన పదవులు, సీట్లు కేటాయింపులో గతంలో ఎన్నడూ లేని విధంగా బీసీలకు సీఎం జగన్ ప్రాధాన్యం ఇచ్చారన్నారు. శెట్టిబలిజ సామాజిక వర్గానికి చెందిన వారిని రాజ్యసభకు, మంత్రులుగా, ఎమ్మెల్సీలుగా నియమించారన్నారు. జరగబోయే ఎన్నికల్లో బీసీ వర్గాల వారిని కేటాయించారన్నారు. ఎన్నికల మేనిఫెస్టోను పవిత్ర గ్రంథంగా భావించి 90 శాతం పైగా హామీలను అమలు చేసి చరిత్రలో నిలిచారన్నారు. ఎస్సీ, బీసీ, మైనార్టీ వర్గాలంతా కలసికట్టుగా మళ్లీ సీఎంగా జగన్‌మోహన్‌రెడ్డిని విజయపథంలో నిలపాలని సూర్యనారాయణరావు పిలుపునిచ్చారు. నాయకులు మట్టపర్తి నాగేంద్ర, కుడుపూడి త్రినాథరావు, కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.



తాటిపాకలో మాజీ మంత్రి గొల్లపల్లిని కలసిన ఎమ్మెల్సీ సూర్యనారాయణరావు

ఎమ్మెల్యే పరామర్శ



రాజోలులో అగ్నిప్రమాద స్థలాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు

రాజోలు: రాజోలు సెంటర్‌లో గ్రంధి కనకం ఫ్యాన్సీ హోల్‌సేల్ షాపు అగ్నిప్రమాదానికి గురికావడంతో సర్వం కోల్పోయిన కుటుంబాన్ని రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు ఆదివారం పరామర్శించారు. ప్రమాదం జరిగిన షాపును పరిశీలించారు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా ప్రమాదం జరిగిందని బాధిత కుటుంబం వివరించింది. రాజోలు ఫైర్‌స్టేషన్‌లో డ్రైవర్ల కొరతగా ఉండడంతో అగ్నిప్రమాద వాహనం ఉన్నా ఉపయోగం లేదని స్థానిక నాయకులు ఎమ్మెల్యే రాపాకకు వివరించారు. అగ్నిమాపక వాహనం నడిపేందుకు సరిపడ డ్రైవర్లను ఏర్పాటు చేయాలని అగ్నిమాపక జిల్లా అధికారితో ఎమ్మెల్యే రాపాక మాట్లాడారు. వైఎస్సార్ సీపీ నాయకులు దార్ల పెదబాబు, మట్టా ఏడుకొండలు, ఆకుల సత్తిబాబు, ఉచ్చుల దాసు తదితరులు పాల్గొన్నారు.

బెయిల్‌పై వచ్చి నాపై తప్పుడు ప్రకటనలు

మలికిపురం: నియోజకవర్గంలో జైలు నుంచి బెయిల్‌పై వచ్చిన ఇద్దరు టీడీపీ నేతలు తనపై తప్పుడు ప్రకటనలు చేస్తున్నారని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ నాయకుడు గొల్లపల్లి సూర్యారావు పేర్కొన్నారు. ఆదివారం ఆయన మలికిపురం మండలం లక్కవరంలో పార్టీ నాయకులు మంగెన సింహాద్రి, మంగెన తాతాజీ, ఉలిశెట్టి లక్ష్మణరావు తదితరులను ఆయన మర్యాద పూర్వకంగా కలిశారు. ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో పదేళ్లు టీడీపీని బలోపేతం చేసి అభివృద్ధి చేస్తే ఆ పార్టీ తనకు తీరని అన్యాయం చేసిందన్నారు. తనకు జరిగిన అన్యాయం చెబితే రాజోలు నియోజకవర్గంలో బెయిల్‌పై వచ్చిన ఇద్దరు టీడీపీ నాయకులు తనపై బురద జల్లుతున్నారని అన్నారు. వారి మాటలు నమ్మితే టీడీపీ కార్యకర్తలు మట్టికొట్టుకు పోతారని, బెయిల్‌పై వచ్చిన ఆ నాయకులు ఎన్నికలు అయ్యాక మరలా జైలుకు పోతారని అన్నారు. ఈ రోజు రాష్ట్రంలో ప్రజా సంక్షేమ పథకాలు నేరుగా లబ్ధిదారుల అకౌంట్‌లో వేస్తున్న ఏకైక సీఎం జగన్ అని అన్నారు. ఆయన వెంట పితాని సూరిబాబు, నాగిరెడ్డి గోపి, కె.కుమార్, స్టూడియో వర్మ పాల్గొన్నారు.



పార్టీ నాయకులను కలసిన మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు

కిడ్నీ బాధితుడికి ఆర్థిక సాయం

రావులపాలెం: కిడ్నీలు పాడై అనారోగ్యంతో బాధపడుతున్న బాధితుడికి స్థానిక కాశీ అన్నపూర్ణాదేవి సేవా సంస్థ సభ్యులు ఆదివారం రూ.15 వేల నగదు అందజేశారు. గ్రామానికి చెందిన యండపల్లి నాగేంద్ర (32)కు రెండు కిడ్నీలు పాడైపోయి కిడ్నీ మార్పు చేయాలని వైద్యులు తెలిపారు. ప్రస్తుతం డయాలసిస్ చేయించుకుంటున్నారు. ఇతనికి ఇద్దరు ఆడ పిల్లలు అనారోగ్యం కారణంగా పనికి వెళ్లలేకపోవడంతో కుటుంబం గడవడం కష్టంగా మారింది. సహాయం కోరడంతో స్థానిక కాశీ అన్నపూర్ణాదేవి సేవా సంస్థ సభ్యులు రూ.15 వేల ఆర్థికసాయం అందజేశారు.



బాధితుడికి సాయం అందజేస్తున్న కాశీ అన్నపూర్ణాదేవి సేవా సంస్థ సభ్యులు

మాదిగ రాజకీయ చైతన్య సభను జయప్రదం చేయండి

ఆలమూరు: మాదిగ రిజర్వేషన్ పోరాట సాధన కోసం ఈనెల ఏడున రావులపాలెం మండలంలోని రావులపాడులో తలపెట్టిన మాదిగ రాజకీయ చైతన్య సభను విజయవంతం చేయాలని వ్యవస్థాపక అధ్యక్షుడు బుంగ సంజయ్ పిలుపునిచ్చారు. మండలంలోని గుమ్మిలేరులో ఆదివారం బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన మాదిగల రాజకీయ చైతన్య సభ కరపత్రాన్ని ఆయన ఆవిష్కరించారు. ఈసందర్భంగా సంజయ్ మాట్లాడుతూ మాదిగలు గడిచిన మూడు దశాబ్దాలుగా వర్గీకరణ కోసం అలుపెరుగని పోరాటం చేస్తున్నారన్నారు. పాలించే ప్రభుత్వాలు మాత్రం మాదిగలను కేవలం ఓటు బ్యాంకుగా చూస్తున్నాయని విమర్శించారు. మాదిగల న్యాయమైన కోరిక అయిన వర్గీకరణను సత్వరమే అమలు చేయాలని డిమాండు చేశారు. నా ప్రజలు పాలకులుగా ఉంటారు తప్ప పాలితులుగా ఉండరు అంటూ నినదించిన ప్రపంచ మేధావి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఆశయ సాధనకై చేస్తున్న పోరాటానికి ప్రజలందరూ మద్దతుగా నిలవాలని విజ్ఞప్తి చేశారు. అలాగే ఎస్సీ రిజర్వుడు స్థానాల్లో అన్ని రాజకీయ పార్టీలు సముచిత స్థానం కల్పించాలని కోరారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బజ్జింగి సుధాకర్, ఎమ్మెస్ఎఫ్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బుంగ సునీల్ దత్తు తదితరులు పాల్గొన్నారు.